

బుగ్గ రామలింగేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు



తాడిపత్రి టౌన్, ఏప్రిల్ 4: పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారిని సూర్యకిరణాలు తాకాయి. ఏటా దక్షిణాయనం, ఉత్తరాయణ పుణ్యకాలలో కొన్ని రోజులపాటు స్వామివారిని సూర్యకిరణాలు తాకడం పరిపాటి అని ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ తెలిపారు.

నీరిచ్చిన సర్పంచ్‌కు కన్నీరు!



వరలక్ష్మి


- వంతపాడుతున్న కార్యదర్శి అధికారులు
- తాగునీటి పనులకు రూ.8 లక్షల అప్పు
- అధికారులను నమ్మి ఖర్చుచేసిన సర్పంచ్
- బిల్లులు ఇవ్వకుండా వేధిస్తున్న అధికారులు

నక్కనదొడ్డిలో వైసీపీ కక్ష సాధింపు

గుంతకల్లు : అధికారులపై నమ్మకంతో.. ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి సొంత డబ్బు వెచ్చించిన నక్కనదొడ్డి సర్పంచ్.. వైసీపీ కుట్రలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్పంచ్ వరలక్ష్మి టీడీపీ మద్దతుదారు కావడమే దీనికి కారణం. గుంతకల్లు మండలంలోని పెద్ద పంచాయతీ నక్కనదొడ్డిలో తీవ్ర తాగునీటి ఎద్దడి తలెత్తింది. సమస్య పరిష్కారానికి వైసీపీ పాలకులకు మనసురాలేదు. దీంతో గ్రామస్థులందరూ కూడబలుక్కుని 1902 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందించడంతో వెంటనే పనులు చేయాలని, నిధులిస్తామని కలెక్టరు ఆదేశించారు. ఆ ఉత్తర్వులను నమ్మిన సర్పంచ్.. గత ఏడాది జూలైలో రూ.8 లక్షలు అప్పు చేసి గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలు, ఆసుపత్రి, గ్రామచావడి వద్ద నీటి వసతిని కల్పించారు. కానీ ఇప్పటి వరకూ బిల్లులు రాలేదు. చేసిన పనులకు ఎంబుక్ రికార్డు చేయకుండా అధికారులు ఆమెను వేధిస్తున్నారు. మండల పరిషత్ అధికారులపై ఈ పంచాయతీకి చెందిన కొందరు వైసీపీ నాయకులు ఒత్తిడి తీసుకువస్తూ.. సర్పంచ్‌కు బిల్లులు రాకుండా అడ్డుకుంటున్నారు. దీంతో బాధిత సర్పంచు వరలక్ష్మి సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో కక్ష సాధింపు చర్యలు మొదలయ్యాయి. 'మాపైనే ఫిర్యాదు చేస్తారా..?' అని మండిపడిన అధికారులు.. అసలు గ్రామంలో తాగునీటి పనులే చేయలేదని ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీంతో దిక్కుతోచక గిరిజన సర్పంచు వరలక్ష్మి కన్నీరు పెట్టుకుంటున్నారు.



సచివాలయం వద్ద పైప్‌లైన్ వేయిస్తున్న సర్పంచు భర్త బొజ్జేనాయక్ (ఫైల్)



ఇదీ జరిగింది..

నక్కనదొడ్డిలో చాలా ఏళ్లుగా తాగునీటికి కటకట ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం సమస్య తీరుతుందని గ్రామస్థులు భావించారు. సర్పంచ్ ఎన్నికలు ఆలస్యంగా జరిగాయి. ఆ తరువాత పంచాయతీలకు నిధులు రాలేదు. తాగునీటి సమస్య తీరలేదు. ఎమ్మెల్యే, ఎంపీపీని గ్రామస్థులు కలిసినా ఫలితం లేకపోయింది. గత ఏడాది మే నెలలో స్పందన అప్‌గ్రేడ్ వెర్షన్ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం మొదలైంది. 1902 టోల్‌ఫ్రీ నంబరు అందుబాటులోకి రావడంతో స్థానికులు సీఎం కార్యాలయానికి ఫిర్యాదులు చేశారు. సత్వరమే సమస్యను పరిష్కరించాలని సీఎస్ నుంచి కలెక్టరు ద్వారా మండల అభివృద్ధి అధికారులకు ఆదేశాలు వచ్చాయి. 'ప్రస్తుతానికి నిధులు లేవు. పనులు చేస్తే బిల్లులు వచ్చేలా చేస్తాం' అని అప్పటి ఎంపీడీఓ నమ్మబలికారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ చర్యలు చేపట్టారు. ఈ పనుల కోసం రూ.8 లక్షలు అప్పు చేసి ఖర్చుపెట్టారు. గ్రామస్థుల సమస్య పరిష్కారమైంది. కానీ సర్పంచ్ టీడీపీ మద్దతుదారు కావడంతో బిల్లులు చేయకుండా చుక్కలు చూపుతున్నారు.

నిజంగా పనులు చేయలేదా?



సీఎంఓ నుంచి ఆదేశాలు రావడంతో ఎంపీడీఓ అధికారులు గ్రామంలో దగ్గరుండి మరీ పనులు చేయించారు. ఎస్సీ, బీసీ కాలనీలకు, ఆసుపత్రి, చావడికి నీటి వసతి కల్పించారు. సర్పంచు వరలక్ష్మి ఆధ్వర్యంలో బీసీ కాలనీలో 360 మీటర్ల పైప్‌లైన్, బోరు, మోటారు, ఐదు వాల్వులు ఏర్పాటు వేశారు. ఎస్సీ కాలనీకి 412 మీటర్ల పైప్‌లైన్ వేశారు. మరో 200 మీటర్ల పైప్‌లైన్‌ను వేసి గ్రామ అవసరాల కోసం చావడి వద్ద, ఆసుపత్రి వద్ద తాగునీటి వసతిని కల్పించారు. పనులు చేసేటప్పుడు రోడ్ కటింగ్‌కు కొందరు గ్రామస్థులు సహకరించలేదు. దీంతో మండల అభివృద్ధి అధికారులు, గ్రామ పోలీసు సంక్షంలో పనులు చేశారు. వంద మీటర్ల మేర రోడ్డును పగులగొట్టించి మరీ పనులు చేయించారు. కానీ వైసీపీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి, అధికారులు ఎంబుక్ రికార్డు చేయడంలేదు. సీఎం కార్యాలయానికి అసత్య నివేదిక పంపారు. గ్రామానికి వెళ్లి విచారిస్తే అసలు విషయం బయటపడుతుంది.



గ్రామ పోలీసు సమక్షంలో పైప్‌లైన్ కోసం రోడ్ కటింగ్ చేయిస్తున్న దృశ్యం(ఫైల్)

రికార్డు రాయకుండా..

బీసీ కాలనీలో వేసిన 360 మీటర్ల పైప్‌లైన్‌కు ఎంబుక్ రికార్డు చేశారు. ఇంకా 614 మీటర్ల పైప్‌లైన్ పనులకు ఎంబుక్ రికార్డు చేయకుండా తిప్పుకుంటున్నారు. దీనికి వైసీపీ నాయకుల ఒత్తిడే కారణమని సర్పంచ్ ఆరోపిస్తున్నారు. 'సీఎంఓకి మాపైనే ఫిర్యాదుచేస్తావా? బిల్లులు ఎలా తెచ్చుకుంటావో తెచ్చుకో..! నక్కనదొడ్డి పంచాయతీకి ఏ బిల్లూ చేయవద్దని వైసీపీ నాయకులు మాకు చెప్పారు' అని పంచాయతీ కార్యదర్శి సుగుణకుమారి తనతో అంటున్నారని సర్పంచ్ వాపోయారు. జనవరిలో సర్పంచ్‌లకు రూ.36 వేల గౌరవ వేతనం విడుదలైంది. కానీ తన ఖాతాలో మాత్రం ఈ సొమ్ము జమచేయకుండా కార్యదర్శి ఇబ్బంది పెడుతున్నారని సర్పంచ్ వాపోయారు.

కూడబలుక్కుని వేధిస్తున్నారు..

నేను సర్పంచు అయిన ప్పటి నుంచి వైసీపీ నాయకులు వేధిస్తున్నారు. మేము చేసిన పనులకు బిల్లులు చేసుకుని కాజేశారు. ఇప్పుడు కూడా ఎంబుక్ రికార్డు చేయవద్దని ఎంపీడీఓ కార్యాలయ అధికారులకు ఫోన్లు చేస్తున్నారు. సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేస్తే.. అసలు పనులే చేయలేదని తప్పుడు నివేదిక పంపారు. ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శి కూడబలుక్కుని మాకు అన్యాయం చేశారు. బీసీ కాలనీ పనులకు రూ.3.50 లక్షలు ఖర్చుకాగా, రూ.2.80 లక్షలకు ఎంబుక్ రాశారు. పైప్‌లైన్‌కు రోడ్ కటింగ్ చేసి, తర్వాత రోడ్డు మరమ్మతు చేశాము. దాన్ని లెక్కలోకి తీసుకోవడంలేదు. ఎస్సీ కాలనీకి, ఇతర పనులకు రూ.4.50 లక్షలకు ఎంబుక్ రాయకుండా వేధిస్తున్నారు. బిల్లులు ఇచ్చే ఉద్దేశం లేనప్పుడు మాచేత పనులు ఎందుకు చేయించాలి..?

- వరలక్ష్మి, నక్కనదొడ్డి సర్పంచ్

వ్యసనంతో పతనం



- చైన్ స్నాచర్‌గా మారిన జవాను
- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు
- 12 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

(7లో...)



ట్రాన్స్‌ఫార్మర్లు, సామగ్రిని పక్కదారి పట్టించారు

- నార్పల మండలంలో రూ.40 లక్షల గోల్‌మాల్
- విద్యుత్ శాఖలో కొందరు ఉద్యోగుల చేతివాటం

ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేరన్నది సామెత. విద్యుత్ శాఖలోని కొందరు ఉద్యోగులు, సిబ్బంది దీన్ని బాగా వంటపట్టించుకున్నారు. భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. బోరు బావులు లేని రైతుల పేరిట వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేయించి, ట్రాన్స్‌ఫార్మర్లు.. ఇతర సామగ్రిని అమ్మేస్తున్నారు. నార్పల మండలంలో రూ.40 లక్షల విలువైన సామగ్రి పక్కదారి పట్టినట్లు సమాచారం. ఆ సొమ్ము పంపకాల్లో తేడాలు రావడంతో ఉద్యోగులు, సిబ్బంది గొడవ పడ్డారని ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా.. సొంత శాఖవారు కావడంతో చర్యలు తీసుకోలేదని అంటున్నారు. - అనంతపురం రూరల్



ట్రాన్స్‌ఫార్మర్లను అమ్మేశారు!

బోరుబావులు లేని రైతులకు మంజూరు

నార్పల మండలం గొల్లపల్లిలో బోర్లు లేని రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దృశ్యం

- గొల్లపల్లిలో ఓ రైతు పేరిట ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలు, వైరు ఇతర సామగ్రి డ్రా చేశారు. ఆ రైతు పొలంలో వ్యవసాయ బోరు బావి లేదు. అయినా ఆ రైతు పేరిట కనెక్షన్ మంజూరు చేశారు. ఏడు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, విద్యుత్ లైన్ కూడా లాగారు. ఈ పనులు కాంట్రాక్టర్‌తో చేయించాలి. కానీ ఉద్యోగులే పనులు చేశారు. కానీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరొకరికి ఎత్తించి సొమ్ము చేసుకున్నారు.
- ఎస్టిమేషన్లు లేకుండా, కనెక్షన్ కోసం డీడీ తీయకపోయినా.. పప్పూరు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇదే తరహాలో చాములూరులో 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. పైసలు దండుకున్నారు.
- కొన్నిరోజుల క్రితం దుర్గం ప్రాంతానికి చెందిన ఓ రైతు వ్యవసాయ కనెక్షన్ కోసం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న తన బంధువుకు కొంత సొమ్మును ఫోన్ పే చేశాడు. కనెక్షన్ మంజూరు చేయకపోవడంతో బాధిత రైతు లోకాయుక్తలో ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు ఆ రైతుతో రాజీచేసుకున్నారు. కేసు విత్‌డ్రా చేయించి, వ్యవసాయ కనెక్షన్ మంజూరు చేసినట్లు తెలిసింది.
- నార్పల మండలంలోని ప్రసిద్ధ క్షేత్రాలలో ఉత్సవాలు జరిగే సమయంలో విద్యుత్ లైన్ల మార్పు, ఇతర అవసరాలకు ఒకలోడుకు పైగా వైరును డ్రా చేసినట్లు తెలుస్తోంది. అయితే అక్కడ విద్యుత్ లైన్లు మార్చకుండా.. ఆ వైరును అమ్మేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

రైతుల పేరిట మాయ..



వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలంటే విద్యుత్ శాఖ అధికారులు సవాలక్ష నిబంధనలు వివరిస్తారు. దరఖాస్తు మొదలు డబ్బు కట్టడం, సీనియార్టీ మేరకు కనెక్షన్ మంజూరు, మెటీరియల్ డ్రా చేయడం తదితర పనులన్నీ జరగాలంటే ఏడాదికి పైనే సమయం పడుతుంది. అదే ఆ శాఖలోని కొందరు ఉద్యోగులు, సిబ్బంది తలచుకుంటే రోజుల వ్యవధిలో చకచకా పనులు పూర్తి అవుతాయి. నార్పల మండలంలో ఇదే జరిగింది. కొందరు లైన్‌మన్లు అడ్డదిడ్డంగా వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు పెట్టి మంజూరు చేయించుకున్నట్లు తెలుస్తోంది. పొలాల్లో బోర్లులేని రైతుల పేరిట వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేసుకుని, ట్రాన్స్‌ఫార్మర్లు, వైరు, ఇతర సామగ్రిని అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి ఎస్టిమేషన్లు లేకుండా, డీడీలు చెల్లించకపోయినా ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తించినట్లు సమాచారం. అందుకు బదులుగా భారీగా డబ్బులు దండుకున్నారని ప్రచారం జరుగుతోంది. నార్పల మండలంలోని గొల్లపల్లి, రంగాపురం, పప్పూరు, బొందలేడు, చాములూరు, కూరగానపల్లి తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు పక్కదారి పట్టాకని తెలిసింది.



ఎస్టిమేషన్ లేకుండానే చాములూరులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

చర్యలు ఏవీ..?

నార్పల మండలంలో జరిగిన అవినీతి, అక్రమాల గురించి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు స్థానికుల నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో డీడీఈతో విచారణ చేయించారు. అక్రమాలు జరిగిన ప్రాంతాలకు వెళ్లి ఆ అధికారి విచారించారు. అక్రమాలు జరిగినట్లు గుర్తించి, నివేదిక తయారు చేసి ఆ శాఖ ఉన్నతాధికారులకు ఇచ్చారని సమాచారం. కానీ అక్రమాలకు పాల్పడింది సొంత శాఖ వారే కావడంతో చర్యలు తీసుకోవడంతో జాప్యం జరుగుతుందోని అంటున్నారు.

నా దృష్టికి రాలేదు..

నార్పల మండలంలో అవినీతి అక్రమాలకు సంబంధించి నా వద్దకు ఎలాంటి నివేదికా రాలేదు. డీఈ వద్దకు వచ్చిందేమో కనుక్కోండి. ఏఈ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని గతంలో మా దృష్టికి వచ్చింది. అతన్ని రిలీవ్ చేశాం. ఏవైనా అక్రమాలు జరిగినట్లు మా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

- సురేంద్ర, ఎస్ఈ, విద్యుత్ శాఖ

తానే ఎస్ఈ అన్నట్లు..

నార్పల మండలంలోని ప్రసిద్ధ ప్రాంతానికి చెందిన ఓ పోల్ టు పోల్ కార్మికుడి కుమారుడు ఈ వ్యవహారాలను నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. అతను స్థానిక అధికారి దగ్గర ప్రైవేటుగా పనిచేస్తున్నట్లు సమాచారం. తన 'పనితనం'తో స్థానిక అధికారిని బుట్టలో వేసుకుని అక్రమాలకు పాల్పడుతున్నాడని ఆరోపనలు ఉన్నాయి. అక్రమ సంపాదనలో పావలా వాటా అధికారికి ఇచ్చి, మిగిలిన సొమ్ము తన జేబులో వేసుకుంటున్నాడని తెలుస్తోంది. ఇతను చెబితే విద్యుత్ శాఖలో ఏ పనైనా ఇట్టే జరిగిపోతుందని అంటున్నారు. నార్పల మండలానికి ఇతనే ఎస్ఈ అన్నట్లుగా పరిస్థితి తయారైంది. సాధారణంగా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరైతే.. జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఉన్న స్టోర్స్ నుంచి తీసుకువెళ్లి రైతుల పొలాల్లో అమర్చాలి. లేదంటే మండల కేంద్రంలోని ఏఈ కార్యాలయంలో ఉంచాలి. కానీ నార్పల క్రాస్‌లోని నర్సరీలో వీటిని నిల్వ ఉంచి అమ్ముకుంటున్నారని సమాచారం.

వేతనం.. ప్యాకేజీ..!

వలంటీర్లకు వైసీపీ ప్రలోభాలు
రాజీనామా చేయాలని ఒత్తిళ్లు



పూలకుంటలో మూకుమ్మడి రాజీనామా చేసిన వలంటీర్లు

రాయదుర్గం, ఏప్రిల్ 4: ఎన్నికల్లో గెలిచేందుకు వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి వలంటీర్లను వాడుకోవాలని చూస్తున్నారు. అధికార పార్టీకి విధేయులుగా ఉన్న వలంటీర్లు ఆయన కోసం ఎన్నికల్లో పనిచేసేందుకు రాజీనామా చేస్తున్నారు. మొన్నటి వరకు పింఛన్ల పంపిణీ అనంతరం రాజీనామా చేయాలని భావించారు. పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా పెట్టాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో వ్యూహం మార్చి.. ముందుగానే రాజీనామా చేస్తున్నారు. గ్రామాలలో బలమైన వైసీపీ నాయకులు వలంటీర్ల చేత రాజీనామా చేయిస్తున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్ మండలాలలో ఇప్పటికే రాజీనామాల ప్రక్రియ మొదలైంది. వైసీపీ అభ్యర్థిని గెలిపించుకునేందుకే తాము రాజీనామా చేస్తున్నామని కొందరు వలంటీర్లు బాహాటంగా ప్రకటిస్తున్నారు. వైసీపీ వ్యూహాన్ని తిప్పికొట్టేందుకు టీడీపీ కార్యాచరణ ప్రారంభించింది.

నేను చూసుకుంటా..

ప్రభుత్వం వలంటీర్లకు చెల్లించే వేతనాన్ని వైసీపీ నాయకులు చెల్లించడానికి సిద్ధపడినట్లు తెలిసింది. 'రాజీనామా చేయండి.. నేను చూసుకుంటా..' అని వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి అంటున్నారని సమాచారం. ఇప్పటికే మార్చి నెల వేతనాన్ని వలంటీర్లు అందుకున్నారు. దీంతో ఏప్రిల్, మే నెలల వేతనాన్ని తాము చెల్లిస్తామని వైసీపీ నాయకులు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు ఒప్పందం చేసుకున్న తరువాతే వలంటీర్లు రాజీనామా చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. దీంతోపాటు ఎన్నికల్లో శ్రమకు తగ్గట్టుగా ప్యాకేజీ కూడా ఇస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వంలో వలంటీర్లుగా తిరిగి నియమించుకుంటామని హామీ కూడా ఇస్తున్నారు. రాజీనామా చేయకపోతే ఎన్నికల అనంతరం తొలగిస్తామని బెదిరిస్తున్నారని కొందరు వలంటీర్లు వాపోతున్నారు. 'మేము ఇచ్చిన ఉద్యోగం.. మా కోసం వదులుకునేందుకు అభ్యంతరం ఏమిటి..?' అని కొందరు నాయకులు వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నారు. తాజాగా సాగుతున్న వలంటీర్ల రాజీనామా వెనుక ఒత్తిళ్లు, ప్రలోభాలు, ప్యాకేజీలు, బెదిరింపులు ఉన్నాయని స్పష్టంగా అర్థమౌతోందని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

వడదెబ్బతో బీటెక్ విద్యార్థి మృతి



నిఖిల్‌చౌదరి (ఫైల్)

యాడికి, ఏప్రిల్ 4: మండల పరిధిలోని రాయలచెరువుకు చెందిన బీటెక్ విద్యార్థి నిఖిల్ చౌదరి(23) వడదెబ్బతో గురువారం మృతిచెందాడు. నిఖిల్‌చౌదరి కర్నూలులోని ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండురోజుల క్రితం రాయలచెరువుకు వచ్చాడు. పెద్దవడుగూరు మండలం కొండుపల్లె వద్ద వీరికి క్వారీ ఉంది. ఆ పనుల నిమిత్తం రెండురోజులపాటు ఎండలో ఎక్కువగా తిరిగాడు. కర్నూలుకు బుధవారం వెళ్లి, అక్కడ మైన్స్‌కు సంబంధించిన రికార్డులు తయారుచేయడం కోసం ఎండలో ఎక్కువగా తిరిగాడు. ఈ కారణంగా అస్వస్థతకు గురైనట్లు బుధవారం రాత్రి స్నేహితులకు తెలిపాడు. టాబ్లెట్ వేసుకుని పడుకున్నాడు. గురువారం తెల్లవారుజామున ఆరోగ్య పరిస్థితి విషమించడంతో స్నేహితులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



అప్పటికే మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

కొత్త కలెక్టర్ వినోద్ కుమార్

ఎస్పీగా అమిత్ బర్దార్ బాధ్యతలు.. కలెక్టర్ రాక ఆలస్యం.. నేడు బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్/క్రైం, ఏప్రిల్ 4: ఎన్నికల వేళ జిల్లాకు కొత్త కలెక్టర్, ఎస్పీ వచ్చారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరుగా డాక్టర్ వినోద్‌కుమార్ నియమితులయ్యారు. ఓటరు జాబితాలో అక్రమాలు, కోడ్ అమలు విషయంలో ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ గౌతమిని కేంద్ర ఎన్నికల కమిషన్ బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కొత్త కలెక్టరుగా డాక్టర్ వినోద్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. జిల్లాకు ఆయన సుపరిచితులు. తొలుత ఎంబీబీఎస్ పూర్తి చేసి డాక్టర్ అయ్యారు. ఆ తరువాత 2004-05 ఐఏఎస్ బ్యాచ్‌కు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో ట్రైనీ కలెక్టరుగా తన కెరీర్‌ను ప్రారంభించారు. అనంతరం ఏపీ స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా, రంపచోడవరం సబ్ కలెక్టరుగా, నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టరుగా సేవలు అందించారు. పార్వతీపురం ట్రైబల్ వెల్ఫేర్‌లోనూ కొన్నాళ్లు సేవలు అందించారు. గ్రామీణ తాగునీరు, మైన్స్, ల్యాండ్ తదితర శాఖలలో పనిచేశారు. తాజాగా జిల్లా కలెక్టరుగా నియమితులయ్యారు. ఆయన గురువారం రాత్రి 8 గంటలకు బాధ్యతలు తీసుకోవాల్సి ఉంది. కానీ జిల్లా కేంద్రానికి చేరుకునే సమయానికి అర్ధరాత్రి దాటుతుందని, శుక్రవారం బాధ్యతలు చేపడతారని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

ఎన్నికల్లో ప్రశాంతతే లక్ష్యం..

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడమే తన లక్ష్యమని కొత్త ఎస్పీ అమిత్ బర్దార్ అన్నారు. ఎస్పీ అన్బురాజన్ బదిలీ నేపథ్యంలో జిల్లాలోని 14వ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న అమిత్ బర్దార్‌ను ఎస్పీగా నియమిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆదేశాలు అందిన కొన్ని గంటల్లోనే ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయనకు గురువారం బాధ్యత అప్పగించారు. అనంతరం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ అమిత్ బర్దార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా యంత్రాంగంతో కలిసి పారదర్శకంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేస్తామని అన్నారు. సమస్యలు, సవాళ్లను సమష్టిగా ఎదుర్కొంటామని అన్నారు. ఎన్నికల వేళ జిల్లా ప్రజలకు, అభ్యర్థులకు సమస్యలుంటే సంబంధిత పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన అమిత్ బర్దార్, 2014 ఐపీఎస్ బ్యాచ్ అధికారి. శిక్షణ అనంతరం ఏఎస్పీగా వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. ఎస్పీగా తొలిసారి శ్రీకాకుళం జిల్లాలో పనిచేశారు. అనంతరం సీఐడీలో పనిచేశారు. 14వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తూ ఎస్పీగా నియమితుడయ్యారు.



జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపడుతున్న అమిత్ బర్దార్

వాట్సాప్ గ్రూపుల్లో ఎన్నికల సిబ్బంది జాబితా

ఇన్‌చార్జి కలెక్టర్, డీఈఓ ఆగ్రహం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 4: ఎన్నికల విధులకు ఎంపికైన పీఓ, ఏపీఓ, ఓపీఓల జాబితాలు వాట్సాప్ గ్రూపులలో హల్‌చల్ చేస్తున్నాయి. గుట్టుగా ఉండాల్సిన జాబితా బయట పడటం కలకలం రేపుతోంది. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్.. ఎన్ఐసీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. జాబితా బయటకు రావడం వెనుక ఎన్ఐసీ విభాగంలో పనిచేస్తున్న ఓ టెక్నికల్ ఇంజినీర్, ఇద్దరు ఉపాధ్యాయుల పాత్ర ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూప్‌లలో ఈ జాబితా చక్కర్లు కొడుతోంది. దీంతో డీఈఓ వరలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ జాబితా నకిలీదని, ఎన్నికల విధుల నియామక ఉత్తర్వులు వ్యక్తిగతంగా అందుతాయని తెలిపారు. ఆ జాబితాను ఎవరూ ఇతరులకు షేర్ చేయవద్దని, షేర్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మరోవైపు ఎన్నికల విధుల నుంచి తప్పించుకునేందుకు చాలామంది అనారోగ్యంతో బాధపడుతున్నట్లు నకిలీ సర్టిఫికెట్లను చూపుతున్నారని, సిఫార్సులు చేయించుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయ సంఘాలవారు సిఫార్సులు చేయించుకుంటున్నారని తెలిసింది.



ఇఫ్తార్	శుక్రవారం సాయంత్రం	06:34
సెహరీ	శనివారం ఉదయం	04:55

ఉష్ణోగ్రతలు (గురు)



గరిష్ఠం : 43.0
కనిష్ఠం : 25.0

పరిశీలకులు వస్తున్నారు.. జాగ్రత్త

ఇన్‌చార్జి కలెక్టర్ కేతన్ గార్గ్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 4: ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా నియమించిన పరిశీలకులు జిల్లాకు వస్తున్నారని, అందరూ జాగ్రత్తగా ఉండాలని ఇన్‌చార్జి కలెక్టర్ కేతన్ గార్గ్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో త్వరలో సాధారణ, ఎన్నికల వ్యయ, పోలీసు పరిశీలకులు జిల్లాకు వస్తారని తెలిపారు. అన్ని నియోజకవర్గాల ప్రొఫైల్స్, నివేదికలు, సమగ్ర సమాచారాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. రాయదుర్గం, అనంతపురం, తాడిపత్రిలోని ఆర్ అండ్ బీ కార్యాలయాలు, జడ్పీ, ఆర్డీటీ, ఎస్కేయూ, జేఎన్‌టీయూ అతిథి గృహాలను తనిఖీ చేసి, అన్ని వసతులు కల్పించాలని సూచించారు. అక్కడ ఫర్నిచర్, కంప్యూటర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల పరిశీలకులు ఎక్కడికి వచ్చినా, ఏ సమాచారం అడిగినా చెప్పడానికి అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో రామక్రిష్ణారెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలవపై కేసు నమోదు



బొమ్మనహాళ్, ఏప్రిల్ 4: టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, రాయదుర్గం నియోజకవర్గ అభ్యర్థి కాలవ శ్రీనివాసులుపై బొమ్మనహాళ్ పోలీసులు కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని ఉంతకల్లు గ్రామంలో మంగళవారం జరిగిన ఇఫ్తార్ విందుకు కాలవ హాజరయ్యారు. ఆ సమయంలో అనుమతి లేకుండా ఉంతకల్లు క్రాస్ నుంచి ఉంతకల్లు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారని బొమ్మనహాళ్ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఫిర్యాదు చేశారని పోలీసులు గురువారం తెలిపారు. దీంతో కాలవ శ్రీనివాసులు, రాయదుర్గం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఆర్.చంద్రహాస్ సహా నలుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఇది అక్రమ కేసు అని టీడీపీ నాయకులు అన్నారు. బైక్ ర్యాలీ జరిగిందీ లేదని, కాలవ శ్రీనివాసులు పాల్గొన్నదీలేదని వారు అంటున్నారు. కాలవ శ్రీనివాసులు రాక కోసం ఉంతకల్లు క్రాస్ వద్ద తాము వేచి ఉన్నామని, కాలవ కారులో వచ్చారని, తాము ముందు బైక్‌లలో వెళ్లామని తెలిపారు. ర్యాలీ నిర్వహించకపోయినా కేసులు నమోదు చేయడం సరికాదని అన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ: పీడీ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 4: వలంటీర్లు లేకున్నా పింఛన్ల పంపిణీ సజావుగా సాగుతోందని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. కక్కలపల్లి, నారాయణపురం గ్రామ పంచాయతీల పరిధిలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను గురువారం పీడీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాకు 2,89,131 మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.86.58కోట్ల నిధులు మంజూరు అయ్యాయన్నారు. బుధవారం బ్యాంకుల నుంచి నిధులు డ్రా చేసి అదేరోజు సాయంత్రం నుంచి పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. 92 శాతం పింఛన్ల పంపిణీతో రాష్ట్రంలో జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు.

2,40,224 మందికి...

పుట్టపర్తి రూరల్: సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా గురువారం నాటికి 2,40,224 మందికి పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. 32 మండలాల్లోని 5 అర్బన్ సెంటర్లలో పంపిణీ ప్రక్రియ సాగిందన్నారు. 2,72,535 మంది పింఛన్‌దారులు ఉండగా 2,40,224 మందికి పంపిణీ చేయడం జరిగిందన్నారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో అందజేస్తామన్నారు. దివ్యాంగులు, నడవలేని వృద్ధులకు సంబంధించి ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంలోని కొన్ని సచివాలయాలకు పింఛన్ నిధులు ఆలస్యంగా రావడంతో పంపిణీ ఆలస్యంగా చేపట్టారు. కాగా పుట్టపర్తి రూరల్ మండలంలో వృద్ధులు, దివ్యాంగులకు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేశారు.

గాండ్లపర్తి ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

రాప్తాడు, ఏప్రిల్ 4: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి వైసీపీ ప్రచారంలో పాల్గొన్న గాండ్లపర్తి ఫీల్డ్ అసిస్టెంట్‌ను శంకర్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గాండ్లపర్తికి వచ్చినప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ ప్రచార రథం ఎక్కి ఎమ్మెల్యే పక్కన నిలబడి ప్రచారం చేశాడు. దీనిపై గురువారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు రాప్తాడు ఎంపీడీఓ గీతావాణి, ఏపీఓ సావిత్రి తెలిపారు.

రంజాన్ తోఫాకు రాం..రాం..!

ఐదేళ్లుగా అందించని వైసీపీ ప్రభుత్వం

టీడీపీ హయాంలో ప్రతి రేషన్‌కార్డుదారుడికి పంపిణీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 4: రంజాన్ తోఫా.. ఈ పేరు వింటే పేద ముస్లింమైనార్టీలకు ఎనలేని ఆనందం. ఎలాంటి ఖర్చు లేకుండా రంజాన్ పండుగ జరుపుకున్న పేదలు ఎందరో. ఆర్థిక ఇబ్బందులతో కష్టాలు ఎదుర్కొంటున్న ముస్లింమైనార్టీలు పండుగపస్తులు ఉండకూడదనే ఉద్దేశంతో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నారా చంద్రబాబునాయుడు చంద్రన్న రంజాన్ తోఫాను తీసుకొచ్చారు. నాలుగు రకాల వస్తువులతో అందించే కిట్లను తెల్లరేషన్‌కార్డు ఉన్న ముస్లిం మైనార్టీలకు అందించారు. అప్పటి ధరలకు అనుగుణంగా రూ. 400లు విలువ చేసే ఈ కిట్లను జిల్లాలో దాదాపు రూ. 1.50 లక్షల మందికిపైగా లబ్ధిదారులకు అందించారు. అయితే అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ముస్లింమైనార్టీల సంక్షేమానికి గండికొట్టిందనే చెప్పాలి. రంజాన్ తోఫాను రద్దు చేసింది.

టీడీపీ హయాంలో రంజాన్ తోఫా

టీడీపీ ప్రభుత్వ హయాంలో తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ముస్లిం కుటుంబానికి పౌరసరఫరాల శాఖ ద్వారా రంజాన్ తోఫాలను అందించింది. అప్పటి ధరల ప్రకారం ఆ కిట్టులో రూ. 200లు విలువ చేసే 5 కేజీల గోధుమపిండి, రూ. 80లు విలువ చేసే 2 కేజీల చక్కెర, రూ. 60లు విలువ చేసే 1 కేజీ సేమియా, రూ. 60లు విలువ చేసే 100 గ్రాముల నెయ్యి లబ్ధిదారులకు అందజేసింది. రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల ముస్లింమైనార్టీ కుటుంబాలకు దాదాపు రూ. 48 కోట్ల వరకూ ఖర్చు చేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇలా అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం రంజాన్ తోఫాను అందజేసింది.

వైసీపీ అధికారంలోకి రాగానే తోఫా కట్...

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రంజాన్ తోఫాకు రాం.. రాం చెప్పేసింది. ముస్లింమైనార్టీలకు అండగా ఉంటామంటూనే ఆ వర్గాలను ఏ సంక్షేమ పథకానికి నోచుకోకుండా చేసిందన్న విమర్శలు ఉన్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క పండుగకూ తోఫాలు అందించకపోవడంపై ముస్లింమైనార్టీలు మండిపడుతున్నారు. అన్ని రకాల సంక్షేమ పథకాలకు దూరం చేసిన వైసీపీ ప్రభుత్వం రంజాన్ తోఫాలను అటకెక్కించి పండుగ పూట పేద ముస్లింమైనార్టీలను పస్తులుండేలా చేసిందని ఆ వర్గాలు ఆవేదన చెందుతున్నాయి.



రంజాన్ తోఫా కిట్ల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అప్పటి సీఎం చంద్రబాబునాయుడు, చిత్రంలో పరిటాల సునీత, పల్లె రఘునాథరెడ్డి



పేద ముస్లింల పొట్ట కొట్టారు..

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముస్లింమైనార్టీలపై అణచివేత ధోరణి ప్రదర్శిస్తోంది. వారికి అందాల్సిన సంక్షేమ పథకాలను రద్దు చేసింది. కార్పొరేషన్ల ద్వారా అందాల్సిన సబ్సిడీ లోన్లను రద్దు చేసింది. పేద ముస్లిం మహిళలకు అందించే ఉచిత కుట్టు మిషన్లను రద్దు చేసింది. ప్రతి పేద ముస్లిం రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన రంజాన్ తోఫాను దూరం చేసి పొట్ట కొట్టింది. ప్రస్తుతం పేద ముస్లిం మైనార్టీలు ఇప్పుడున్న ధరలతో పండుగను అరకొరగా జరుపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- గౌస్‌మొద్దీన్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్

రంజాన్ తోఫాతో పండుగ జరుపుకునేవాళ్లం

టీడీపీ గవర్నమెంట్‌లో అందించిన రంజాన్ తోఫాతో రెండు రోజుల పాటు పండుగ జరుపుకునేవాళ్లం. పండుగ రోజు సేమియా కీరు, రొట్టెలు చేసుకునేవాళ్లం. మిగిలిన వాటితో మరుసటి రోజున వంటలు చేసుకొని పండుగను ఆనందంగా జరుపుకునేవాళ్లం. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రంజాన్ తోఫాను నిలిపివేసి అన్యాయం చేసింది. పండుగ పూట కూడా మమ్మల్ని ఇలా ఇబ్బందిపెట్టడం ఏం బాగోలేదు.

- మహమ్మద్ గౌస్, శింగనమల



వ్యసనంతో పతనం

చైన్ స్నాచర్‌గా మారిన జవాను

ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు

12 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

అనంతపురం క్రైం, ఏప్రిల్ 4: క్రికెట్ బెట్టింగ్, దురలవాట్లకు బానిసలైన ముగ్గురిని చైన్ స్నాచింగ్, ద్విచక్ర వాహనాల చోరీ కేసులలో పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఒకరు ఆర్మీ జవాన్ కావడం గమనార్హం. డీపీఓలో ఇన్‌చార్జి ఎస్పీ విజయ భాస్కర్ రెడ్డి ఈ కేసుల వివరాలను వెల్లడించారు.

● నార్పల మండలం కేశేపల్లికి చెందిన వేణు ఇండియన్ ఆర్మీలో జవాను. ప్రస్తుతం సెలవులో ఉన్నాడు. క్రికెట్ బెట్టింగ్, పేకాట వంటి వ్యసనాలకు బానిసయ్యాడు. భారీగా అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు చైన్ స్నాచింగ్‌లు ప్రారంభించాడు. అనంతపురం, కురుగుంటలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. డీఎస్పీ టీవీ శివారెడ్డి ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి నేతృత్వంలోని పోలీసుల బృందం కట్టకిందపల్లి సమీపంలో నిందితుడిని అరెస్టు చేసింది. నిందితుడి నుంచి 9 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

● కంబదూరు మండలం వెంకటాంపల్లికి చెందిన ఎనుముల మారుతీ ప్రసాద్, ముడావత్ రామ్లానాయక్ స్నేహితులు. క్రికెట్ బెట్టింగ్, పేకాట తదితర వ్యసనాలకు బానిసలై.. అప్పులు చేశారు. వాటిని తీర్చడానికి, వ్యసనాలను కొనసాగించేందుకు చైన్ స్నాచింగ్, బైక్ దొంగతనాలు ప్రారంభించారు. ఏడాదిన్నర కాలంలో అనంతపురం టూటౌన్, త్రీటౌన్, తాడిపత్రి, ధర్మవరం, బత్తలపల్లి, కర్ణాటకలోని బళ్లారి, సింధనూరు ప్రాంతాల్లో బైక్‌లను దొంగిలించారు. వీరిపై గతంలో అనంతపురం వన్‌టౌన్, టూటౌన్, తాడిపత్రి అర్బన్, పావగడ పోలీస్‌స్టేషన్లలో చైన్ స్నాచింగ్ కేసులు ఉన్నాయి. సీసీఎస్ సీఐ ఇస్మాయిల్ తదితరులతో కూడిన పోలీసుల బృందం వీరిని గార్లదిన్నె సమీపంలో అరెస్టు చేసింది. నిందితుల నుంచి మూడు తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను చూపుతున్న పోలీసులు

జెల్లిపల్లిలో దొంగల భయం

ఐదు ఎకరాల్లో డ్రిప్‌వైరు చోరీ

రూ. 75 వేల మేర నష్టం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 4: కంబదూరు మండల పరిధిలోని జెల్లిపల్లిలో దొంగల భయం పట్టుకుంది. వ్యవసాయ పరికరాలను టార్గెట్ చేసుకుని దొంగలు వాటిని ఎత్తుకుని వెళుతున్నారు. బుధవారం రాత్రి రైతు అనిల్‌కు సంబంధించిన ఐదు ఎకరాల్లో ఏర్పాటు చేసిన డ్రిప్ వైరును గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించుకుని వెళ్లారు. దీని విలువ సుమారు రూ. 75 వేలు వుంటుందని బాధిత రైతు తెలిపాడు. అప్పు చేసి తెచ్చుకున్న డ్రిప్ సామగ్రిని దొంగలు ఎత్తుకుని వెళ్లడంతో ఆర్థికంగా మరోభారం తనపై పడుతోందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధిత రైతు కంబదూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు.



ఆగిన రైతు గుండె

మిరపపంట సాగుకు రూ.20 లక్షల వరకు అప్పు

పంట దిగుబడి బాగున్నా.. ధర రోజురోజుకూ పతనం

ఛాతిలో నొప్పితో కుప్పకూలి మృత్యుఒడిలోకి..

పామిడి, ఏప్రిల్ 4: ఎన్నో ఆశలతో మిరపపంటను సాగు చేశాడు. సాగు చేసిన పంట ధర రోజురోజుకూ కుదేలవడంతో రైతు నాగరాజు (40) గుండె ఆగి కుప్పకూలాడు. మండలంలోని రామగిరిలో గురువారం ఈ సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని రామగిరి గ్రామానికి చెందిన నాగరాజు, మారెమ్మ దంపతులు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతడికున్న మూడు ఎకరాల పొలంతోపాటు మరో ఎనిమిది ఎకరాలను కౌలుకు తీసుకొని మిరపపంట సాగుచేశాడు. పంటసాగు చేసేందుకు, కౌలుకు దాదాపు రూ. 20 లక్షల వరకు అప్పు చేశాడు. పంట దిగుబడి మంచిగా ఉండటంతో తన అప్పులు తీరుతాయని భావించాడు. అయితే ధర రోజురోజుకూ పతనం అవుతుండటంతో కుంగిపోయాడు. అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో కిందపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోయిన ఆ రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నాగరాజు (ఫైల్)

ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

యాడికి, ఏప్రిల్ 4: ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. ఈనెల 30న మండలంలోని పెద్దపేట గ్రామంలో ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారని, బాధితుల ఫిర్యాదుమేరకు కేసు కేసు నమోదు చేశామన్నారు. బుధవారం యాడికిలో వాహనాలను తనిఖీ చేస్తుండగా హైదరాబాద్‌కు చెందిన గిరిజన్‌కుమార్, సూర్యచంద్ర, ప్రేమ్‌సాయి అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకొని విచారించడం జరిగిందన్నారు. యాడికిలోని కుంటలో, పెద్దపేట గ్రామంలో తాము దొంగతనానికి పాల్పడినట్లు వారు అంగీకరించారని సీఐ వివరించారు. తెలంగాణ రాష్ట్రం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు కేసులు, కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, సూరరాం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక కేసు వారిపై ఉన్నట్లు విచారణలో తెలిపారన్నారు. వారివద్ద నుంచి 4గ్రాముల బంగారం, కొన్ని వెండి ఆభరణాలు సీజ్‌చేసినట్లు తెలిపారు. ముగ్గురిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపామన్నారు.



అంతర్రాష్ట్ర దొంగలను చూపుతున్న సీఐ

మర్తాడులో పట్టపగలే చోరీ

50 తులాల బంగారు ఆభరణాలు,

రూ. 2 లక్షల నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

గార్లదిన్నె, ఏప్రిల్ 4: తాళం వేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి సుమారు 50 తులాలు బంగారు ఆభరణాలు, రూ. 2 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. మర్తాడు గ్రామంలో గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. మాజీ సర్పంచ్ రామసుబ్బారెడ్డి మృతిచెందడంతో భార్య తులసమ్మ ఒక్కటే ఇంటో ఉంటోంది. వారి కుమారుడు వంశీకృష్ణారెడ్డి డిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా గురువారం తిమ్మాపేంటలోని బంధువుల ఇంట్లో కార్యక్రమానికి తులసమ్మ ఉదయం 11 గంటలకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 50 తులాల బంగారు, రూ. 2 లక్షలను చోరీ చేశారు. కార్యక్రమం ముగిసిన అనంతరం గ్రామానికి వచ్చిన తులసమ్మ ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి, శింగనమల సర్కిల్ సీఐ శ్రీధర్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. నల్లమాస్కులు ధరించి ముగ్గురు ఇంటిలో నుంచి బయటకు రావడం చూసినట్లు పోలీసులకు ఓ విద్యార్థి సమాచారం అందించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రతిభ



నవోదయ ప్రవేశాలు సాధించిన విశ్వం విద్యార్థులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 4: నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో తిరుపతి విశ్వం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి తెలిపారు. 39 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి నవోదయ పాఠశాలల్లో ప్రవేశాలు సాధించారని వెల్లడించారు. లక్ష్మీశ్రీ, జ్యోత్స్న, ఉదయశ్రీ, లాస్య, గౌతంకుమార్, కేతన్ భాస్కర్, లిఖిత, గంగజయదీప్‌రెడ్డి తదితరులు ప్రవేశాలు పొందిన వారిలో ఉన్నారని చెప్పారు. అకడమిక డైరెక్టర్ ఎన్. విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాల వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థ అత్యుత్తమమైందిగా పేరుగాంచిందని చెప్పారు.

స్పాట్‌లో అయ్యవార్లకు తాగునీటి కష్టాలు

క్యాన్లు ఉదయం దించి తర్వాత పట్టించుకోని అధికారులు

భోజనం వేళ గురువులకు తప్పని ఇబ్బందులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 4: అయ్యవార్లకూ తాగునీటి కష్టాలు తప్పడం లేదు. 10వ తరగతి మూల్యాంకనం అనంతపురంలోని కేఎస్ఆర్ హైస్కూల్, కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలోని పలు గదుల్లో జరుగుతోంది. ఈ నెల 1వ తేదీ నుంచి స్పాట్ మొదలైంది. ఎండాకాలంలో ఇంటిపట్టున నీడన కూర్చున వారికి సైతం గంటకోసారి నీళ్లు తాగాలనిపిస్తుంది. మరి స్పాట్ కేంద్రంలో గంటల తరబడి కూర్చుని పేపర్లు దిద్దుతూ మార్కులు వేసే టీచర్ల పరిస్థితి ఆలోచించాల్సిన పనిలేదు. స్పాట్‌లో వందలాది మంది టీచర్లు పేపర్లు దిద్దుతున్నారు. అయితే ఉపాధ్యాయులకు సరిపడా తాగునీటిని అధికారులు అందుబాటులో ఉంచడం లేదు. ఉదయం కొన్ని వాటర్ క్యాన్లు, డ్రమ్ముల్లో దించి నీళ్లు నింపి వదిలేస్తున్నారు. అయితే ఆ నీళ్లు మధ్యాహ్నానికి ఖాళీ అవుతున్నాయి. 40 డిగ్రీలకుపైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఎండల వేడి నేపథ్యంలో టీచర్లు దాహం తీర్చుకునే స్థాయిలో నీళ్లు అందుబాటులో ఉండటం లేదు. భోజన సమయానికి ఖాళీగా క్యాన్లు, డ్రమ్ములు ఉంటుండంతో ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు మండిపడుతున్నారు. జిల్లా విద్యాశాఖ, పరీక్షల విభాగం అధికారులు టీచర్లు, సంఘాల నేతల దాహం కేకలను పెడ చెవిన పెడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.



మహిళ ఆత్మహత్య

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 4: మండలంలోని వసగుడ్డం గ్రామానికి చెందిన కావేరి(33) అనే మహిళ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. వసగుడ్డం గ్రామానికి చెందిన గోనప్పకు కర్ణాటక కరుగోడు గ్రామానికి చెందిన కావేరితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఐదు నెలల పాప ఉంది. కొద్దిరోజులుగా కుటుంబ కలహాలు తరచూ జరుగుతుండటంతో తీవ్ర మనస్థాపం చెందింది. దీంతో గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కావేరి ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు తలుపులు బద్దలు కొట్టి చూడగా అప్పటికే మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

అనంతపురం న్యూటౌన్/ గార్లదిన్నె, ఏప్రిల్ 4: స్థానిక ఉన్నత పాఠశాల సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మరణించాడని రైల్వే పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తికి 40 సంవత్సరాలు ఉంటాయని, మృతుడి శరీరం గుర్తుపట్టలేని విధంగా ఉందని, మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని అన్నారు. తెలిసిన వారు 85002 38200, 99088 37888ను సంప్రదించాలని సూచించారు.

పాలిటెక్నిక్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

హాజరుశాతం తక్కువ కావడంతో డిటెయిన్ చేసిన లెక్చరర్లు

నిద్రమాత్రలు మింగిన విద్యార్థి

విద్యార్థి సంఘాల ఆందోళన

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 4: అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం అభ్యసిస్తున్న చరణ్ గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తాను ఉంటున్న ప్రైవేటు హాస్టల్‌లో నిద్రమాత్రలు మిగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు పరమేష్, కుళ్లాయిస్వామి బాధిత విద్యార్థి కుటుంబం తరపున ఆందోళనకు దిగారు. కళాశాలకు చేరుకుని అధికారులతీరుపై మండిపడ్డారు. చరణ్ తరచూ అనారోగ్యానికి గురవుతుండటంతోనే తరగతులకు సరిగా హాజరుకాలేకపోయాడన్నారు. అటెండెన్స్ సరిగా లేదని లెక్చరర్లు చరణ్‌ను డిటెయిన్ చేశారన్నారు. తనకు ఆరోగ్యం సరిగాలేనందునే తరగతులకు హాజరుకాలేకపోతున్నానని లెక్చరర్లను వేడుకున్నా వారు పట్టించుకోలేదన్నారు. బాధ్యులైన లెక్చరర్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ హాజరుశాతం 65గా నమోదైతే పరీక్షకు అనుమతి ఇస్తామన్నారు. అనారోగ్యం కారణంగా హాజరుశాతం తగ్గితే డాక్టర్ వైద్య చికిత్సలకు సంబంధించిన ధృవీకరణపత్రమిస్తే అధికారులతో మాట్లాడి అవకాశం కల్పించాలని కోరతామన్నారు.

హాజరుశాతం 59గా నమోదైంది: లెక్చరర్ రాధిక

చరణ్ హాజరుశాతం 59గా ఉంది. మీ కుమారుడు కళాశాలకు సక్రమంగా రావడంలేదని తండ్రి చిరంజీవికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాము. దీంతో కళాశాలకు ఆయన వచ్చి ఆరాతీశారు. ఆ రోజు కూడా చరణ్ కళాశాలకు రాలేదు. దీంతో తండ్రి అతడిని పిలిపించి హెచ్చరించాడు. మిడ్‌ఎగ్జామ్స్‌లోనూ పాసు మార్కులు రాలేదు. అనారోగ్యానికి సంబంధించిన పత్రాలను సమర్పించాలని కోరినా ఇవ్వలేదు. డిటెయిన్ లేకుండా చూడాలని చరణ్ నెలక్రితం వచ్చి అడిగాడు. నా చేతిలో ఏమీలేదని చెప్పాను.

సమాచారమివ్వలేదు: చరణ్ తండ్రి చిరంజీవి

నా కుమారుడు చరణ్ తరగతులకు సక్రమంగా హాజరుకావడంలేదని అధికారులు నాకు సమాచారమివ్వలేదు. అనారోగ్యంతో బాధపడుతుంటే పలుమార్లు కర్నూలు ఆసుపత్రిలో వైద్యచికిత్సలు చేయించాను. ఈ విషయాన్ని మెకానికల్ బ్రాంచ్ హెచ్‌ఓడీకి, లెక్చరర్‌లకు తెలిపాను. ఆ సమయంలో మాత్రమే కళాశాలకు వెళ్లలేదు. అప్పుడేమో ఆరోగ్యం జాగ్రత్త.. బాగా చూపించుకోమన్నారు. ఇప్పుడేమో అటెండెన్స్‌లేదని డీటైన్ చేశారు. దీంతో పరీక్షలు రాయలేనన్న బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. న్యాయంచేసి పరీక్షలు రాసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.



వైద్యచికిత్సలు పొందుతున్న విద్యార్థి చరణ్, అధికారులతో మాట్లాడుతున్న కుటుంబ సభ్యులు

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

టెలికాలర్స్ కావలెను
ప్రముఖ విద్యా కళాశాల నందు పని చేయుటకు టెలికాలర్స్ కావలెను. ఆడవారికి మాత్రమే జీతం:- 6000-15000/- వయస్సు 18-40 సం॥లు సంప్ర. Ph:8019989913
AJA-176979

WANTED
» SOUS CHEF for Newly Opening Multi - Cuisine Restaurant in VIJAYAWADA, AP (South Indian, Chinese & Continental). Exp: 8 + Years, Qual: Degree, Resume : m3344b@gmail.com
AJB-182035

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 176978

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

స్కేటింగ్ జాతీయ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన నిత్యశ్రీ, రామచరణ్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 4: ఇటీవల తిరుపతిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 11వ తేదీ నుంచి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సాత్నాలో నిర్వహించే 67వ ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన నిత్యశ్రీ, రామచరణ్ పాల్గొంటున్నారు. వీరిని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, స్కేటింగ్ కోచ్ మధు గురువారం అభినందించారు.

నేడు సీతమ్మకు సారె సమర్పణ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 4: స్థానిక కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సీతమ్మకు సారె సమర్పణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి శ్రీరామ దండు 108 సార్లు తారకమంత్ర పారాయణం, అనంతరం చిన్నజీయర్ స్వామి శిష్యబృందం సీతారాములకు ఎదురుకోలు ఉత్సవం, కల్యాణోత్సవం, పట్టాభిషేకం, తదనంతరం మహిళలు తమ ఇళ్ల నుంచి తీసుకువచ్చిన సారెను అమ్మవారికి సమర్పించడం జరుగుతుందన్నారు. భక్తులు విరివిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మూగజీవాలకు చెరువు నుంచి తాగునీరివ్వండి

శింగనమల, ఏప్రిల్ 4: మూగజీవాలకు తాగడానికి శింగనమల చెరువు నుంచి నీటిని విడుదల చేయాలని మండలంలోని గొర్రెల కాపర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్‌రావుకు వినతి పత్రం ఇచ్చిన వారు మాట్లాడారు. మండలంలో గొర్రెలు 60 వేలు, పశువులు ఉన్నాయని, గత సంవత్సరం వర్షాలు రాకపోవడంతో మూగజీవాలకు గుప్పెడు నీరు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం శింగనమల చెరువు నుంచి కొద్దిపాటి నీటిని మాగజీవాల తాగునీటి కోసం తూముల ద్వారా విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 4: రాప్తాడు సమీపంలోని జాతీయ రహదారిపై టాటా పికప్ వాహనంలో తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు విజిలెన్స్ సీఐ వెంకటరమణ గురువారం తెలిపారు. వాహన యజమాని సుబ్బరాయప్ప, డ్రైవర్ నందీశ్వర్, అజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో వీరిపై క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక సీఎస్‌డీటీ జ్యోతికి అప్పగించామన్నారు.

దాడిచేసిన వారిని శిక్షించాలి

అనంతపురంరూరల్, ఏప్రిల్ 4: ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నాయకులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు అల్తాఫ్, సాంబశివుడు, కోశాధికారి టీవీరెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే లోపాలను ప్రశ్నించినందుకు.. ఆ ఎమ్మెల్యే అనుచరులు దాడి చేయడం సరైంది కాదన్నారు.

వలంటీర్ల రాజీనామా

అనంతపురంరూరల్, ఏప్రిల్ 4: వైసీపీ నాయకులు ఒత్తిళ్ల మేరకు కురుగుంట పంచాయతీ పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న 11 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. వాటిని ఆమోదించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.31 వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 4: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.31 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.19 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 532 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

గడ్డివామి దగ్ధం

రామగిరి, ఏప్రిల్ 4: మండలంలోని ముత్యాలంపల్లిలో సాకే చక్కిరప్పకు చెందిన గడ్డివామి గురువారం దగ్ధమైంది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో దాదాపు రూ.25 వేల విలువైన గ్రాసం దగ్ధమైందని బాధితుడు వాపోయాడు.

కార్యకర్తలకు అండగా ఉంటా: జకీవుల్లా

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 4: ఎవరూ అధైర్యపడొద్దని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు కేఎం జకీవుల్లా భరోసా ఇచ్చారు. గురువారం అనంతపురం రూరల్ మండలం చంద్రబాబు కొట్టాలలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవి ఉన్నా.. లేకపోయినా తనను నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, జయరాం నాయక్, తిరుపాల్, లక్ష్మీనాయుడమ్మ, రమాదేవి, ఫిరోజ్ అహ్మద్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

రామగిరి, ఏప్రిల్ 4: మండలంలోని పేరూరు గ్రామానికి చెందిన చిన్న అక్రమంగా ఇసుకను రెండు ట్రాక్టర్లలో తరలిస్తుండగా సెబ్‌పోలీసులు గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. అతన్ని రామగిరి పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకున్నారు. మద్యం ప్యాకెట్లు స్వాధీనం: రామగిరికి చెందిన ఓ మహిళ అక్రమంగా తన ఇంట్లో మద్యం విక్రయిస్తుండగా పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఆమె ఇంట్లో నిల్వ ఉంచిన 110 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం


మాట్లాడుతున్న బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య

రామగిరి, ఏప్రిల్ 4: ఎన్నికల్లో మాజీ మంత్రి పరిటాల సునీతను గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేద్దామని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, పాటు టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం రామగిరి టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక


టీడీపీలోకి చేరుతున్న వైసీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 4: మండల కేంద్రానికి చెందిన పలువురు వైసీపీ శ్రేణులు మాజీ మంత్రి పరిటాల సునీత, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. గురువారం అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ



కూడేరు: మండలంలోని ఇప్పేరు గ్రామంలో వేద పండితుల మంత్రాల నడుమ బొడ్రాయి ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గురువారం పలు రకాల పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అట్టహాసంగా దగ్గుబాటి ప్రచారం ప్రారంభం

● భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు ● బాణసంచా పేల్చుతూ.. పూల వర్షంతో స్వాగతం



టీడీపీ ప్రముఖులతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న దగ్గుబాటి, పాల్గొన్న ముఖ్య నేతలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 4: అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ ఎన్నికల ప్రచార పర్వాన్ని గురువారం అట్టహాసంగా ఆరంభించారు. స్థానిక గుత్తి రోడ్డులోని కనకదాస విగ్రహం నుంచి ఈ ప్రచార కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. కనకగాస విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని 10వ డివిజన్‌లో తొలి రోజు ప్రచారం నిర్వహించారు. దారి పొడవునా బాణాసంచా పేల్చుతూ.. పూల వర్షంతో ఆయనకు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. తొలిరోజు ప్రచారంలో పలువురు సీనియర్ నాయకులు సైతం దగ్గుబాటి ప్రసాద్‌కు మద్దతునిచ్చారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు టీడీపీ అభ్యర్థి ప్రసాద్‌ను గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత అనంత అర్బన్‌ను రాష్ట్రంలో అన్ని విధాలా అగ్రగామిక తీర్చిదిద్దుతామని దగ్గుబాటి అన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, దగ్గుబాటి ప్రసాద్ సతీమణి శ్రీలక్ష్మి, జనసేన రాష్ట్ర నాయకులు భవాని రవికుమార్, మాజీ మేయర్ స్వరూప, అనంత అర్బన్ బ్యాంక్ చైర్మన్ జేఎల్ మురళీధర్, రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాష్‌నాయుడు, నాయకులు బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళీ, సుధాకర్ నాయుడు, కొండవీటి భావన, కూచి హరిప్రసాద్, వెంకటప్ప, రాజారావు, సైఫుద్దీన్, లింగారెడ్డి, సెట్టిం బాలకృష్ణ, బోయ రమణ, కృష్ణకుమార్, చంటి, చెన్నప్ప, డిష్ ప్రకాష్, చంద్రమౌళి, భాస్కర్, సంగా తేజస్విని, వడ్డే భవాని, గంగాదేవి, జనసేన నాయకులు హర్ష, చలపతి, వెంకటనారాయణ, సంపత్ పాల్గొన్నారు.

ప్రచారాన్ని అడ్డుకునే యత్నం చేసిన వైకుంఠం వర్గీయులు : దగ్గుబాటి ప్రసాద్ ఎన్నికల ప్రచారాన్ని గురువారం పాతూరులో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి వర్గీయులు అడ్డుకునే యత్నం చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి వారికి సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించడంతో వివాదం సద్దుమణిగింది.

ప్రముఖులతో దగ్గుబాటి భేటీ

దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ గురువారం టీడీపీ ప్రముఖులతో భేటీ అయ్యారు. మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి సోదరుడు వైకుంఠం జయచంద్రచౌదరిని శ్రీనగర్ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ఎన్నికల్లో తనకు సహకరించాలని ప్రసాద్ ఆయన్ను కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ.. గత 40 సంవత్సరాలుగా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు చేసుకుంటూ వస్తున్నానని, ఇక నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తానని, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి తనవంతు సహకారం అందిస్తానని అన్నారు.

గాండ్ల విశాలాక్షితో భేటీ : టీడీపీ గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షిని దగ్గుబాటి ప్రసాద్ గురువారం సాయంత్రం నగరంలోని ఆమె నివాసమంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు. ఆయన వెంట నాయకులు రాయల్ మురళీ, కూచి హరిప్రసాద్, సైఫుద్దీన్ ఉన్నారు.

పింఛన్ల పంపిణీపై జగన్‌రెడ్డి కొత్త డ్రామా

● వలంటీర్ వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదు : మాజీ మంత్రి పరిటాల సునీత

రాప్తాడు, ఏప్రిల్ 4: పింఛన్ల పంపిణీపై సీఎం జగన్‌రెడ్డి కొత్త డ్రామాకు తెరలేపారని మాజీ మంత్రి పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని అయ్యవారిపల్లి, ప్రసన్నాయపల్లి, చిన్మయ్‌నగర్, ఇందిరమ్మ కాలనీల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పింఛన్ల పంపిణీ విషయంలో టీడీపీపై వైసీపీ దుష్ప్రచారం చేస్తోందని వాటిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరం పెట్టారన్నారు. ఇందులో టీడీపీ ప్రమేయం లేదన్నారు. టీడీపీ వలంటీర్ల వ్యవస్థకు వ్యతిరేకం కాదని, తాము అధికారంలోకి వచ్చినా వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని అన్నారు. సచివాలయాల్లో 1.26 లక్షల మంది సిబ్బంది ఉన్నారని, రెండు రోజుల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయ వచ్చని అన్నారు. ప్రభుత్వం సచి వాలయ సిబ్బంది ద్వారా పింఛన్లు ఇంటింటికీ పంపిణీ చేయకుండా టీడీపీపై దుష్ప్ర చారం చేస్తోందన్నారు. రంగం పేటకు చెందిన వైసీపీ నాయ కుడు మండల శివారెడ్డి బుధవా రం బాలాజీ ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరగా... శివారెడ్డిని ఎమ్మెల్యే సోదరుడు రాజశేఖర్‌రెడ్డి బెదిరిం చి గురువారం ఉదయం వైసీపీ కండువా కప్పార న్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, గంగలకుంట రమణ, ఉప్పర శ్రీనివాసులు, సర్పంచులు తిరుపాలు, ఉజ్జినప్ప, మాజీ డీలర్లు శీనా, శ్రీరాములు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో ప్రచారం

పుల్లలరేవు, గొందిరెడ్డిపల్లి, యర్రగుంట గ్రామాల్లో పరిటాల సునీత ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని టీడీపీ నాయకులు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు పుల్లలరేవులో ప్రచారం ప్రారంభమవుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.


అయ్యవారిపల్లిలో పరిటాల సునీత ప్రచారం

గెలుపే ధ్యేయంగా సమష్టిగా పనిచేద్దాం

అంబికా లక్ష్మీనారాయణను కోరిన బండారు శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం/శింగనమల ఏప్రిల్ 4: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా సమష్టిగా పనిచేద్దామని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ.. పార్టీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను కోరారు. గురువారం నగరంలోని బండారు శ్రావణి ఇంటికి అంబికా లక్ష్మీనారాయణ వెళ్లి.. ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, మాజీ జెడ్పీటీసీ షాలిని దొర, ఈశ్వర్‌రెడ్డి, రవీంద్రా పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

శింగనమల : మండలంలోని సలకం చెరువు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. గురువారం సాయంత్రం అనంతపురంలోని బండారు శ్రావణిశ్రీ స్వగృహంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి, తిరుపాలు, బాలరాజు పాల్గొన్నారు.


బండారు శ్రావణిశ్రీని కలిసిన ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

హనుమేష్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

వైద్యులను విచారించిన త్రిసభ్య కమిటీ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 4: స్థానిక చంద్రబాబునాయుడు కొట్టాల కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ హనుమేష్ (32) రోడ్డు ప్రమాదంలో గాయపడి జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించిన విషయం తెల్సిందే. వైద్యుల నిర్లక్ష్యం వల్లే అతను మరణించాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేయడంతో గురువారం హనుమేష్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయగా... విచారణకు సూపరింటెండెంట్ ముగురు వైద్యులతో కమిటీని నియమిం చారు. వారు కూడా గురువారం విచారణ చేపట్టారు. రికార్డులు, ఆ సమయంలో డ్యూటీలో ఉన్న వైద్యులు, సిబ్బందితో పలు విషయాలు ఆరా తీశారు. అడ్మిషన్‌లో ఉన్న హనుమేష్ డిశ్చార్జ్ లేకుండానే వెళ్లిపోయినట్లు తేలింది. దీంతో శుక్రవారం మరోసారి బాధిత కుటుంబ సభ్యులను విచారిస్తామని సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు.

నాసా వరల్డ్ చాంపియన్స్‌గా శ్రీచైతన్య విద్యార్థులు

అనంతపురం విద్య, ఏప్రిల్ 4: అమెరికా నాసా కాంటెస్ట్ 2024లో శ్రీచైతన్య విద్యార్థులు వరల్డ్ చాంపియన్లుగా నిలిచినట్లు ఆ సంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం చైతన్య విద్యాసంస్థల ఏజీఎం, ఇతర ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో ఆ విద్యార్థులు నగరపాలక సంస్థ కమిషనర్ మేఘాస్వరూప్‌ను ఆయన ఛాంబర్‌లో కలిశారు. ఏజీఎం మాట్లాడుతూ.... నాసా కాంటెస్ట్‌లో 11సార్లు శ్రీచైతన్య విద్యార్థులు చాంపియన్లుగా నిలిచారన్నారు. 2024 కాంటెస్ట్‌లో 28 దేశాలకు పైగా పాల్గొనగా శ్రీచైతన్య విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారన్నారు. నాసా మూడు నగదు అవార్డులు ప్రకటించగా, వరుసగా రెండో ఏడాది కూడా తమ విద్యార్థులు సాధించినట్లు గుర్తు చేశారు. వరల్డ్ కాంటెస్ట్ ఫస్ట్ ప్రైస్ ఏడు ప్రాజక్టుల్లో మొదటి ప్రాజక్టు అనంతపురం హౌసింగ్ బోర్డుకు చెందిన శ్రీచైతన్య గర్ల్స్ క్యాంపస్ విద్యార్థులు శ్రీనిధి, అక్షర, అను, ఉదయర్, నవ్యశ్రీ, కావ్య, యువశ్రీ, నిహారిక,వైష్ణవి, శ్రేష్ఠ సాధించారన్నారు. ప్రాజక్టుల్లో 45 మంది విద్యార్థులు పాల్గొనగా కేవలం 10 మాత్రమే డిజిటల్ స్పేస్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ప్రాజక్టు రూపొందించి మొదటి స్థానం సాధించారని ఏజీఎం కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సమీనాఖాన్, ఖలందర్, విశ్వనాథ్, వెంకటేష్, ఇర్షాద్, ఫిలిప్, తబస్సుమ్, శాంత, శ్రీదేవి, నేత్ర, పర్వీన్, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాసులు, నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ షమీనా, డీన్ సత్యనారాయణ, ఇతరులు చంద్రమోహన్, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే : నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ప్రీప్రైమరీ -2, 5వ తరగతి పూర్తయిన విద్యార్థులకు ఈ వేడుక నిర్వహించారు. ఏజీఎం ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ప్రశంసించారు.


విద్యార్థులను అభినందిస్తున్న కమిషనర్


మామిళ్లపల్లిలో ప్రచారం చేస్తున్న బీకే, నాయకులు

టీడీపీ గెలిస్తే ఇంటి వద్దకే రూ.4 వేలు పింఛన్

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : టీడీపీ అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే ఇంటి వద్దే రూ. 4 వేలు పింఛన్‌ను అందిస్తామని టీడీపీ హిందూపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి ఓటర్లకు హామీ ఇచ్చారు. గురువారం కనగానపల్లి మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడారు. నిధుల లేమితో జగన్ కావాలనే పింఛన్లను అందించడంలో జాప్యం చేస్తున్నారని, ఆ నెపాన్ని టీడీపీ పైకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సెట్టిం వెంకటేష్, కన్వీనర్ యాతం పోతలయ్య, ప్రధాన కార్యదర్శి నరేంద్రరెడ్డి, ఎంపీటీసీ బిల్లే భాస్కర్ పాల్గొన్నారు. చెన్నేకొత్తపల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి ఆధ్వర్యంలో, బుక్కరాయసముద్రం మండలంలోని కొండాపురం గ్రామంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి ఆధ్వర్యంలో, రామగిరి మండలం తిమ్మాపురం గ్రామంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.


చెన్నేకొత్తపల్లిలో ఎల్ నారాయణచౌదరి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం


కొండాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న పసుపుల హనుమంతరెడ్డి


తిమ్మాపురంలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

పెన్షనర్ల జీవితాలతో ఆడుకుంటున్న జగన్

రాయదుర్గం: పెన్షనర్ల జీవితాలతో జగన్ ఆటాడుతున్నాడని టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. గురువారం ఆయన పట్టణంలోని ఒకటో వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే జూలై నుంచే పెన్షనర్లకు నెలకు రూ.4 వేలు ఇంటి వద్దకే పంపిణీ చేస్తామన్నారు. చంద్రబాబుపై నెపాన్ని మోపి దుష్ప్రచారాన్ని చేయడానికి పెన్షనర్ల జీవితాలతో జగన్ ఆట్లాడుకుంటున్నాడని ధ్వజమెత్తారు.

విద్యుత్ కోతలు.. లో ఓల్టేజీ

ఎండుతున్న పంటలు... ఆందోళనలో అన్నదాతలు



బండమీదపల్లిలో వాడుదశకు చేరుకున్న వేరుశనగ

రాప్తాడు, ఏప్రిల్ 4: విద్యుత్ కోతలు, లో-ఓల్టేజీ అన్నదాతలకు శాపంగా మారాయి. విద్యుత్ సమస్యల వలన చేతికందిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. బోర్లలో నీరు సమృద్ధిగా ఉన్నా పంటలకు తడి అందక ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని రోజుల నుంచి లో ఓల్టేజీ సరఫరా అవుతోందని, అందువల్ల మోటార్లు, స్టార్టర్ పెట్టెలు కాలిపో తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటికి రిపేర్లకు రూ. వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. లో ఓల్టేజీకి తోడు ఎండలు కూడా ఎక్కువగా ఉండటంతో పంటలు తొందరగా ఎండిపోతున్నాయన్నారు. మండలంలోని హంపాపురం, మరూరు, గాండ్లపర్తిలో విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. హంపాపురం సబ్ స్టేషన్ నుంచి హంపాపురం, రామినేపల్లి, రాప్తాడు, గంగలకుంట, బొమ్మేపర్తి, గొల్లపల్లి, గొందిరెడ్డిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. మరూరు, గాండ్లపర్తి సబ్ స్టేషన్ నుంచి సమీప గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేసినప్పుడు లో ఓల్టేజీ ఉండటంతో మోటార్లు సరిగ్గా ఆడక బోర్లలో నుంచి నీరు తక్కువగా వస్తోంది. ఫలితంగా పంటలు ఎండిపోతున్నాయి.

7 గంటలే సరఫరా

వ్యవసాయానికి రోజుకు 9 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి. అయితే ప్రస్తుతం 7 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారు. పగలు 4 గంటలు, రాత్రి సమయంలో 3 గంటలు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం సరఫరా చేసే 7 గంటల విద్యుత్ కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాను వేళపాల లేకుండా సరఫరా చేస్తున్నారని, దీంతో పంటలకు నీరు సరిపోక ఎండిపోతున్నాయని వాపోతున్నారు.


మోటారు రిపేరీకి రూ. 4 వేలు



రెండు ఎకరాల్లో బెండ సాగు చేశా. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అయినప్పుడు లో ఓల్టేజీ ఉండటంతో మోటార్లు కాలిపోతున్నాయి. ఐదురోజుల క్రితం మోటారు కాలిపోయింది. రిపేరీకి రూ.4 వేలు ఖర్చయింది. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి.

- శ్రీనివాసులు, రైతు రామినేపల్లి

6 గంటలే విద్యుత్



తగరకుంట సబ్ స్టేషన్ నుంచి భోగినేపల్లికి విద్యుత్ సరఫరా అవుతోంది. పగలు, రాత్రి కలిపి మొత్తం 9 గంటల సరఫరా చేయాల్సి ఉండగా ఆరు గంటలు మాత్రమే సరఫరా చేస్తున్నారు. రెండు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. పంటకు నీరు సరిపోవడం లేదు. విద్యుత్ అధికారులు సమస్య పరిష్క రించాలి.

- ముత్యాలప్ప, రైతు భోగినేపల్లి

సమస్యను పరిష్కరించాం

గతంలో లోఓల్టేజీ సమస్య ఉండేది. వారం రోజుల నుంచి నాణ్యమైన.. కోతలు లేని విద్యుత్ సరఫరా చేస్తున్నాం. భోగినేపల్లికి కనగానపల్లి మండలం తగరకుంట సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుండటం వలన ఆరు గంటలే సరఫరా చేస్తున్నాం. మిగతా అన్ని గ్రామాలకు ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నాం.

- రమాదేవి, విద్యుత్ శాఖ ఏఈ, రాప్తాడు

టీడీపీతోనే గ్రామాలకు మహర్దశ: అమిలినేని


అమిలినేని సురేంద్రబాబుకు హారతి పడుతున్న మహిళ

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 4: టీడీపీ అధికారంలోకి వస్తేనే గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ వస్తుందని, ఆ దిశగా పార్టీని గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు కోరారు. గురువారం కంబదూరు మండల యర్రబండ, తిమ్మాపురం, ఓబుగానిపల్లి, జక్కిరెడ్డిపల్లి, కొత్తపల్లి, ఒంటారెడ్డిపల్లి, జల్లిపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలలో అమిలినేనికి అపూర్వ ఆదరణ లభించింది. గ్రామగ్రామాన ప్రతి ఒక్కరు స్వాగతం పలికారు. అమిలినేని మాట్లాడుతూ పల్లె నుంచి పట్టణం వరకు అభివృద్ధి పథంలో నడవాలంటే ఒక్క టీడీపీ తోనే సాధ్యమన్నారు. ఈ సారి ఐక్యతతో వుంటూ కళ్యాణదుర్గంలో పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎక్కడ చూసినా పార్టీకి ప్రజలు బ్రహ్మారథం పడుతున్నారని అన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు రావాలన్నా, కుటుంబానికి ఆర్థిక భద్రత వుండాలన్నా ఒక్క చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధి కావాలంటే... టీడీపీని గెలిపించండి


మాట్లాడుతున్న జేసీ దివాకర్‌రెడ్డి

పెద్దవడుగూరు, ఏప్రిల్ 4: మండలం అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించాలని టీడీపీ మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాంపురం, రామరాజుపల్లి, చిట్టూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కంటే అరాచకాలే ఎక్కువయ్యాయన్నారు. మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే కేవలం టీడీపీతోనే సాధ్యమన్నారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, గంగరాజుయాదవ్, నరేంద్రరెడ్డి, నల్లపురెడ్డి జనార్దన్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఓబుళపతి, హరినాథ్‌రెడ్డి ఉన్నారు.

జేసీ బ్రదర్స్‌ను కలిసిన టీడీపీ ఎంపీ అభ్యర్థి


జేసీపీఆర్‌తో అంబికా లక్ష్మీనారాయణ

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 4: స్థానిక నివాసంలో గురువారం టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ జేసీబ్రదర్స్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, జేసీ అశ్మిత్‌రెడ్డిలతో చర్చించారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జేసీ సోదరులు కోరారు. అంతకుమునుపు ఎంపీ అభ్యర్థి జేసీ సోదరులకు శాలువా కప్పి సన్మానించారు. జేసీపీఆర్ ఎంపీ అభ్యర్థికి శాలువాతో సత్కరించారు.

పుట్లూరు: అనంతపురం టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గురువారం ఆ పార్టీ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తాడిపత్రిలోని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటివద్ద చవ్వా కులశేఖర్‌రెడ్డితో పాటు పలువురు కార్యకర్తలు కలిశారు. ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసి తనను ఎంపీగా భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు.

టీడీపీకే షరతులు... వైసీపీకి వర్తించవా?

బొమ్మనహాళ్, ఏప్రిల్ 4: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రచారాలు చేస్తున్నారని టీడీపీ నాయకులపై అడుగడుగునా ఆంక్షలు వేస్తూ షరతులు పెడుతున్నారు. ఉంతకల్లు గ్రామంలో అనుమతులు లేకుండా ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారని కాలవ శ్రీనివాసులుతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథరెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కృష్ణాపురం గ్రామంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో పాల్గొన్న కాలవ శ్రీనివాసులును ఎంపీడీఓ విజయమ్మ కలిసి నిబంధనలకు విరుద్ధంగా ప్రచారాలు చేస్తున్నారని, ముందుగానే అనుమతులు తీసుకోవాలని సూచించారు. మావైపే కాకుండా వైసీపీ వైపు కూడా చూడాలని ఆయన కోరారు. దీనిపై అన్ని ఆధారాలతో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళతానని కాలవ శ్రీనివాసులు అన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 4: శెట్టూరు మండలం అడవిగొల్లపల్లి అటవీ ప్రాంతంలో గురువారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు బెళుగుప్ప మండలం భూదివర్తి గ్రామానికి చెందిన బోయ భీమలింగ ట్యాక్సీ నడుపుకుంటూ కళ్యాణదుర్గం పట్టణంలో జీవిస్తున్నాడు. పట్టణానికి చెందిన బోయ గణేష్, మరికొంతమంది కలిసి కర్ణాటకలోని పాతప్పగుడికి వెళ్లి కర్ణాటక మద్యం తెస్తూ మార్గమధ్యలో హత్య చేసినట్లు ఆరోపిస్తున్నారు. టెట్రా ప్యాకెట్లు తీసుకుని వస్తున్న క్రమంలో భీమలింగకు గాయాలు కావడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి బోయ గణేష్ మరికొంతమంది తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు భీమలింగ భార్య రత్నమ్మ, కుటుంబ సభ్యులు తన భర్తతో అక్రమ సంబంధం పెట్టుకున్న మహిళ హత్య చేయించినట్లు ఆరోపించారు. మృతుడి భార్య రత్నమ్మ ఫిర్యాదు మేరకు శెట్టూరు పోలీసులు అనుమానాస్పదం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య రత్నమ్మ, కొడుకులు గణేష్, ప్రశాంత్ వున్నారు.

గడ్డివాముల దగ్ధం

● ప్రమాదంలో ఆవు మృతి

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 4: మండలంలోని కాదలూరు గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో గ్రామానికి చెందిన రైతుల గడ్డివాములు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఒక ఆవు మృతిచెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు రైతు హనుమంతరెడ్డి గ్రామ సమీపంలో పశువుల మేతకు గడ్డివాములు ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం ప్రమాదవశాత్తు గడ్డివాములకు నిప్పు అంటుకోవడంతో పూర్తిగా కాలిపోయాయి. గమనించిన గ్రామస్థులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్‌ఇంజన్ మంటలను ఆర్పేందుకు ప్రయత్నించింది. ఈ ప్రమాదంలో రైతు కెంచప్పకు చెందిన ఆవు మంటల్లో కాలిపోయింది. రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు.

కళ్యాణదుర్గంరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో రైతు బిక్కిలప్పకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. రైతు బిక్కిలప్ప తెలిపిన వివరాల మేరకు పశువుల మేతకు నాలుగు ట్రాక్టర్ల గడ్డివాము పొలానికి సమీపంలో ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం ప్రమాదవశాత్తు దగ్ధమైనట్లు తెలిపారు. రూ.50 వేలు ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

పెద్దవడుగూరు, ఏప్రిల్ 4: మండలకేంద్రంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్‌చేసి అతనివద్ద నుంచి 12మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు గురువారం ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి మద్యం విక్రేతను అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మూడు ట్రాక్టర్ల పట్టివేత

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 4: గుమ్మఘట్ట మండలం భూపసముద్రం నుంచి రాయదుర్గానికి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సీఐ శ్రీనివాసులు గురువారం తెలిపారు. బుధవారం రాయదుర్గం మండలం వేపరాళ్ల ఇసుక రీచ్ నుంచి కర్ణాటకకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని తగు చర్య నిమితం ఏడీ మైన్స్ అండ్ జియాలజీ వారికి సమాచారాన్ని అందించినట్లు తెలిపారు.

వడ్డెర్లను ఎస్టీల్లో చేర్చేందుకు కృషి: కాలవ


మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఏప్రిల్ 4: వెనుకబడిన వడ్డెర్ల సామాజిక వర్గాన్ని ఎస్టీల్లో చేర్చేందుకు కృషి చేస్తానని టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. గురువారం పట్టణంలో నిర్వహించిన జయహో బీసీలో భాగంగా వడ్డెర్లతో ఆత్మీయ సమ్మేళనాన్ని సీతారామాంజనేయ కళ్యాణ మంటపంలో నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలోని అభయాంజనేయస్వామి దేవాలయం నుంచి పెద్ద ఎత్తున వడ్డెర్లు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం వినాయకసర్కిల్‌లో గజమాలతో కాలవ శ్రీనివాసులును సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వడ్డెర్ల కోసం అధికారంలోకి రాగానే కమ్యూనిటీ భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. జగన్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను అడుగడుగునా అణచివేస్తున్నారన్నారు. వడ్డెర్ల సంఘం నాయకులు దుర్గేష్, హనుమంతు, గోవిందు, శ్రీనివాసులు, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

వైసీపీ దుష్టపాలనకు చరమగీతం పాడాలి

బొమ్మనహాళ్: వైసీపీ దుష్టపాలనకు చరమగీతంకు పాడాల్సిన సమయం ఆసన్నమైందని టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ దశాబ్దాల నుంచి రాయదుర్గం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను పాలు పంచుకుంటున్నామన్నారు. జనసేన ఇన్‌చార్జి మంజునాథగౌడ్, బలరాంరెడ్డి, హనుమంతరెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున, యర్రగుంట్ల వెంకటేశులు, మల్లికార్జున, వాణిజగన్నాథరెడ్డి, ముల్లంగి నారాయణస్వామి, అప్పారావు పాల్గొన్నారు.

వడ్డెర్ల సామాజికవర్గం బైక్ ర్యాలీ

గుమ్మఘట్ట: మండలంలోని గోనబావి, పూలకుంట, జే వెంకటంపల్లి గ్రామాల నుంచి టీడీపీ వడ్డెర్ల సామాజికవర్గం సభ్యులు గురువారం పూలకుంట గ్రామం అయ్యప్పస్వామి ఆలయం నుంచి బైక్‌ర్యాలీతో రాయదుర్గం పట్టణంలోని ఎన్‌టీఆర్ విగ్రహం వరకు వెళ్లారు. కన్వీనర్ గిరిమల్లప్ప, మాజీ సర్పంచులు గొల్ల తిప్పేస్వామి, బీఎన్‌టీ వెంకటేశులు, వడ్డె హనుమంతు, శ్రీనివాసులు, దానవేంద్ర పాల్గొని బైక్‌ర్యాలీని ప్రారంభించారు.


గుమ్మఘట్టలో ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు

వైసీపీ ప్రభుత్వం తాగునీటిని కూడా ఇవ్వలేకపోయింది

● టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 4: ఐదేళ్లు రాష్ట్రంలో అధికారాన్ని వెలగబెట్టిన వైసీపీ ప్రభుత్వం పట్టణాలు, గ్రామాలలో కనీసం తాగునీటిని కూడా ఇవ్వలేకపోయిందని గుంతకల్లు టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం విమర్శించారు. గురువారం స్థానిక కసాపురం రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా దాహపు కేకలు వినిపిస్తున్నాయని, గుంతకల్లు మీదుగా రెండు తాగు, సాగునీటి కాల్వలు వెళుతున్నా తాగునీటికి దిక్కులేకుండా పోయిందన్నారు. టీడీపీ నాయకులు నారాయణ స్వామి, కేసీ హరి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, రామన్న చౌదరి, ధనుంజయ, జనసేన నాయకుడు మణికంఠ, బీజేపీ నాయకులు పీ హరిహరనాథ్, విజయలక్ష్మి, శేకప్ప, కే రామాంజనేయులు పాల్గొన్నారు.

పార్టీకి, ప్రజలకు వారధులు సర్పంచులు: ప్రజల మధ్య తిరిగే సర్పంచులు పార్టీకి అనుసంధాన కర్తలని గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం జయరాం ఇంటి వద్దకు వెళ్లిన టీడీపీ సర్పంచులు తమ మద్దతును తెలిపారు. దోనిముక్కల సర్పంచు శ్రీరాములు, గుర్రబ్బాడు సర్పంచు జయరాములు, నక్కనదొడ్డి సర్పంచు వరలక్ష్మి, వెంకటాంపల్లి సర్పంచు శ్రీనివాసులు, గుండాల సర్పంచు శ్రీపతి నాయుడుకు జయరాం ధన్యవాదాలు తెలిపారు.

గుత్తి: టీడీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలుస్తానని గుంతకల్లు నియోజకవర్గ అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. పట్టణంలోని సితారా ఫంక్షన్ హల్‌లో గురువారం మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ బద్రివలి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, కేసీ హరి, నారాయణ, న్యాయవాది సోమశేఖర్ పాల్గొన్నారు.


గుమ్మనూరుతో భేటీ అయిన గుంతకల్లు మండల సర్పంచులు

పామిడి: సార్వత్రిక ఎన్నికల్లో గుంతకల్లు నియోజకవర్గంలో కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి టీడీపీ జెండాను ఎగురవేద్దామని గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రామాంజనేయులునాయక్, రమేష్‌నాయక్, వడ్డే ఆనంద్ పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

గుత్తిరూరల్: టీడీపీ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం మండలంలోని కె.ఊబిచేర్లలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లడుతూ చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేస్తే రాష్ట్రం బాగుంటుందన్నారు. టీడీపీ మండల కన్వీనర్ బర్దివలి, కె.సి హరి, గుమ్మనూరు నారాయణ, డాక్టర్స్ సెల్ అధ్యక్షులు హిమబిందు, సర్పంచు భరత్, చిన్నరెడ్డి యాదవ్, సాంబ శివ, సుధాకర్ నాయుడు, వెంకటరాముడు, నరసింహులు, రవితేజ ఏంకే చౌదరి, ప్రతాప్, గోవిందు, రామాంజనేయులు, ప్రభాకర్ నాయుడు పాల్గొన్నారు.

అమిలినేని చెంతకు 150 వైసీపీ కుటుంబాలు


బోరంపల్లిలో టీడీపీలోకి చేరిన వారితో అమిలినేని

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 4: నియోజకవర్గంలో టీడీపీలోకి వలసలు ఊపందుకున్నాయి. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో గురువారం 150 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. వీరందరికీ పార్టీ కండువా వేసి టీడీపీలోకి అమిలినేని ఆహ్వానించారు. బోరంపల్లికి చెందిన 30 వైసీపీ కుటుంబాలు, ముదినాయనపల్లిలో 15 కుటుంబాలు టీడీపీ పార్టీలోకి చేరాయి. అలాగే మున్సిపాలిటీలోని 13, 14, 16వ వార్డులకు చెందిన వైసీపీ నాయకులు చంద్రబాబు, మద్దిలేటి, మహేష్, రంగస్వామి ఆధ్వర్యంలో 43 కుటుంబాలు పార్టీలోకి చేరారు. కుందుర్పి మండల తూముకుంట గ్రామంలో 51 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. వీరందరికీ పార్టీ కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఒక్కరోజులోనే 150 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరడంతో పార్టీలో కొత్త జోష్ నింపింది.

200 కుటుంబాలు టీడీపీలో చేరిక

రాయదుర్గం: వైసీపీకి రాయదుర్గంలో ఎదురు దెబ్బ తగిలింది. గోనబావి, జే వెంకటంపల్లి, పూలకుంట గ్రామాలకు చెందిన గోవింద, రమేష్, హనుమంతు, కుమార్, వెంకటేష్, రుద్రప్ప, సన్నప్పయ్య, పెద్దన్న, వీరేష్, మారెన్న, రామాంజనేయులు, మాంతేష్, బాబు, శివన్న, రాజు, నాగరాజులతో పాటు 190 కుటుంబాలకుపైగా వడ్డెర్ల కులానికి చెందిన వైసీపీ కుటుంబాలు గురువారం పార్టీలో చేరారు.

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో వైసీపీ నుంచి 20 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. గురువారం టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు సమక్షంలో 16 పయ్యావుల కుటుంబాలతో పాటు చంద్రగిరి గ్రామానికి చెందిన నాలుగు కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. పయ్యావుల విరూపాక్షప్ప, పయ్యావుల తిప్పయ్య, శ్రీనివాసులు, వెంకటేశులు, ప్రశాంత్, కొర్రపాటి హనుమేష్, నర్రా రవికుమార్, చంద్రగిరికి చెందిన సిద్ధప్పతో పాటు మరో 12 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.


రాయదుర్గంలో టీడీపీలోకి చేరిన వైసీపీ కుటుంబాలు

వైసీపీలో స్వేచ్ఛలేక టీడీపీలో చేరికలు


జయరాం సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలరు ప్రభాకర్, తదితరులు

గుంతకల్లు: వైసీపీలో ప్రజా ప్రనిధులకు స్వేచ్ఛ లేక, అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వని కారణంగా అందరూ టీడీపీ పట్ల ఆకర్షితులౌతున్నారని టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం కసాపురం రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో 1వ వార్డు వైసీపీ కౌన్సిలరు ప్రభాకర్, అతడి సంబంధీకులు జయరాం సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ నాయకులు ఉడదాల మస్తాన్, అంజి, సూరి, రాజు, హరి, బ్రహ్మయ్య, తదితర 60 కుటుంబాలవారు టీడీపీలో చేరారు.

రాజకీయాలకు అతీతంగా ఉండాలి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 4: అంగన్‌వాడీ కార్యకర్తలు రాజకీయాలకు అతీతంగా ఉండాలని తాడిపత్రి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు నాగేశ్వరమ్మ, ప్రధాన కార్యదర్శి జ్యోతిలత గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ఎన్నికల కారణంగా ఆయాపార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు అంగన్‌వాడీ వర్కర్లు ఏ పార్టీకి మద్దతు ఇవ్వకూడదన్నారు. అత్యుత్సాహం ప్రదర్శిస్తే ఇబ్బందులు తప్పవని వారు హెచ్చరించారు.

ప్రతి లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తాం

యాడికి, ఏప్రిల్ 4: పింఛన్ సొమ్ముపై లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికి అందిస్తామని ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. నడవలేనిస్థితిలో ఉన్న పలువురు పింఛన్‌దారులకు గురువారం ఇంటివద్దకు వెళ్లి వేలిముద్రలు తీసుకొని డబ్బును అందించామన్నారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 86 శాతం పింఛన్ పంపిణీ పూర్తిచేశామని తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

కణేకల్లు, ఏప్రిల్ 4: ఓటు హక్కును ప్రజలంతా నిర్భయంగా వినియోగించుకోవాలని ఇందుకు అన్ని విధాలా శాంతిభద్రత చర్యలు చేపడతామని డీఎస్పీ శ్రీనివాసులు ప్రజలకు భరోసా ఇచ్చారు. గురువారం డీఎస్పీ ఆధ్వర్యంలో కణేకల్లు, హనుమాపురం, హనకనహాళ్, కళేకుర్తి తదితర గ్రామాలలో పోలీసుకవాతు నిర్వహించారు. సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్నికలవేళ గుర్తుకొచ్చిన డ్రైనేజీ!

యల్లనూరు, ఏప్రిల్ 4: మండల కేంద్రంలోని కొన్ని సంవత్సరాల నుంచి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్య గురించి పట్టించుకోని అధికార పార్టీ నాయకులు ఎన్నికలవేళ డ్రైనేజీ పనులు మొదలుపెట్టారు. పాతపేటలోని రెండు ఎస్సీకాలనీల్లో డ్రైనేజీ నీరు ఎక్కడబడితే అక్కడ నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుండేది. అధికారపార్టీ నాయకులు ఎప్పుడు కాలనీకి వచ్చినా ఇదే సమస్య గురించి చెప్పేవారు. అయితే ఎన్నికలు రావడంతో ఓట్లు అడగడానికి కాలనీలోకి వెళ్లలేమనే పరిస్థితి వస్తుందేమోనన్న అనుమానంతో రెండురోజుల క్రితం పనులు మొదలుపెట్టి బెడ్ వేసిన వెంటనే కాలువ నిర్మాణ పనులు చేస్తున్నారు. ఎన్నికలకోడ్ అమలులోకి వచ్చినా అధికారులు అధికార పార్టీ నాయకులచేత ఎలా పనులు చేయిస్తున్నారో వారికే అర్థం కావాలి.


గురువారం వేసిన మురుగునీటి కాలువ

ఎన్నికల నిర్వహణకు సహకరించండి

యాడికి, ఏప్రిల్ 4: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్నిపార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ సావిత్రి కోరారు. బుధవారం యాడికిలోని సమావేశ భవనంలో అన్నిపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. యాడికి సీఐ నాగార్జునరెడ్డి, ఈఓపీఆర్‌డీ వెంకటేష్, టీడీపీ, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు భూమిపూజ

పామిడి, ఏప్రిల్ 4: మండలంలోని దిబ్బసానిపల్లి, వంకరాజుకాలువ గ్రామాల్లో ఆర్డీటీ సంస్థ ఆర్థిక సహకారంతో అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఒక్కో భవనాన్ని రూ.70లక్షల వ్యయంతో నిర్మించనున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ డీల్లీశ్వరి, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ లక్ష్మి, ఆర్డీటీ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు.. భవిష్యత్తుకు మెట్టు

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 4: ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తే ఉపాధి అవకాశాలు మెండుగా వుంటాయని విశ్రాంత ఆంగ్ల అధ్యాపకుడు మల్లికార్జున తెలిపారు. ప్రతి సంవత్సరం డిగ్రీ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి ఆంగ్ల భాష వ్యక్తీకరణపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే 25వ తేదీ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎటువంటి రుసుం చెల్లించిన అవసరం లేదని ప్రతి ఒక్క విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9849086826 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

గుత్తి, ఏప్రిల్ 4: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు కోరారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో ఆర్డీటీ మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు అరికడదాం, ఆడబిడ్డలను కాపాడుదామని అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు లఘు చిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీఓ డిల్లీశ్వరి, ఎస్ఐ నబీరసూల్ పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

బెళుగుప్ప, ఏప్రిల్ 4: మామిడి పంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టి, యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల ఉద్యాన శాఖ అధికారి కృష్ణతేజ రైతులకు సూచించారు. గురువారం నరసాపురం గ్రామంలో మామిడిపంట రైతులకు పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు.

పెన్షనర్ల జీవితాలతో ఆడుకుంటున్న జగన్


రాయదుర్గంలో ప్రచారం చేస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఏప్రిల్ 4: పెన్షనర్ల జీవితాలతో ముఖ్యమంత్రి జగన్ ఆటాడుతున్నాడని టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. గురువారం ఆయన పట్టణంలోని ఒకటో వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు జరిగిన తక్షణమే చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే జూలై నుంచే పెన్షనర్లకు నెలకు రూ.4 వేలు ఇంటి వద్దకే పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. వయస్సు మీద పడిన వృద్ధులకు పెన్షన్లను ఇళ్ల వద్దకు వెళ్లి అందిస్తామని చెప్పి, వాటిని సక్రమంగా ఇవ్వకుండా వృద్ధులకు నానా ఇబ్బందులు పెడుతున్నాడని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి చంద్రబాబుపై నెపాన్ని మోపి దుష్ప్రచారాన్ని చేయడానికి పెన్షనర్ల జీవితాలతో ఆట్లాడుకుంటున్నాడని ధ్వజమెత్తారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కేశవ్


భోజనం వడిస్తున్న ఎమ్మెల్యే

ఉరవకొండ, ఏప్రిల్ 4: పట్టణంలో ముస్లింల ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా పలు మసీదుల్లో నిర్వహించిన ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. ఉపవాసదీక్షలు విరమించిన ముస్లింలకు స్వయంగా ఆయన భోజనం వడ్డించారు. రంజాన్ శుభాకాంక్షలను తెలిపారు. అలాగే జైనబ్బీ దర్గాలోని మసీదు, కోట వీధిలో ఉన్న మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే తనయుడు విజయ్‌సింహా పాల్గొన్నారు. టీడీపీ మైనార్టీ నాయకులు రహంతుల్లా, అల్లాబకాష్, ఖలందర్, సలాం, తాజు, రఫీ పాల్గొన్నారు.

అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది: జితేంద్ర గౌడ్


మాట్లాడుతున్న జితేంద్ర గౌడు

గుంతకల్లు, ఏప్రిల్ 4: తనకు టీడీపీ అధిష్టానం నుంచి పిలుపు వచ్చిందని, విజయవాడకు వెళ్లి పార్టీ నేతలతో మంతనాలు జరిపి వచ్చి విషయాలు కార్యకర్తలకు వినిపిస్తానని మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడు అన్నారు. గురువారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో తన అనుయాయులతో ఆయన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తననే నమ్ముకుని ఉన్న నాయకులు, కార్యకర్తల పట్టుదల కారణంగా అధిష్టానం తనను మాట్లాడ్డానికి పిలిచిందన్నారు. పార్టీ అధినాయకులతో మాట్లాడటానికి వెళ్తున్నారు. తనకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలను తెలిపారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ పవన్‌కుమార్ గౌడు, నాయకులు ధర్మతేజ గౌడు, టీ కేశప్ప, పాల మల్లికార్జున, రాయల రామయ్య, శివన్న, శివప్ప, ఫజులు, అంజలీదేవి పాల్గొన్నారు.

ధర్మవరం సభకు తరలిన బీజేపీ నాయకులు


సత్యకుమార్‌తో తాడిపత్రి బీజేపీ నాయకులు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్4: సత్యసాయి జిల్లా ధర్మవరంలో గురువారం జరిగిన సభకు స్థానిక బీజేపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. కూటమి ధర్మవరం ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ నిర్వహించిన సభకు వాహనాల్లో తరలివెళ్లారు. వెళ్లిన వారిలో రాష్ట్ర కార్యదర్శి హరీష్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, గంగాధర్‌యాదవ్, రంగనాథరెడ్డి, అంజనేయులు, రాంబాబు, రామాంజనేయులు ఉన్నారు.

పింఛన్‌దారులకు మజ్జిగ పంపిణీ


పింఛన్ లబ్దిదారులకు మజ్జిగ, తాగునీటి బాటిల్స్‌ను అందిస్తున్న టీడీపీ నాయకులు

పామిడి, ఏప్రిల్ 4: పట్టణంలోని గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ పంపిణీ చేస్తుండడంతో లబ్దిదారులకు గురువారం టీడీపీ నాయకులు మజ్జిగ, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. పట్టణంలోని పలు సచివాలయాల వద్ద వారు లబ్దిదారులకు అవసరమైన సౌకర్యాలు చేపట్టారు. మాజీ కౌన్సిలర్ టీటీ రమణారావు, మహమ్మద్ రఫీ, నల్లబోతుల శ్రీనివాసులు, రామకృష్ణ, వడ్డే శివకుమార్, రామాంజి, సూరి, రమణ, సత్య, బెస్త సూరి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన విగ్రహాలు

పామిడి, ఏప్రిల్ 4: పట్టణంలోని జాతీయ రహదారి పక్కనున్న అయ్యప్ప ఆలయంలో గురువారం గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, పార్వతీదేవి, నవగ్రహ, నాగ ప్రతిమల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఆదివాస స్నపనం, యంత్ర ప్రతిష్ఠ, బింబ ప్రతిష్ఠ, కళాన్యాసము లు, ప్రాణ ప్రతిష్ఠ, జ్వాలాదర్శనం తదితర పూజలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు హాజరయ్యారు.

ఉరవకొండ: పట్టణంలో కోట మారెమ్మ, దేవమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్ఠోత్సవంలో భాగంగా యంత్రాభిషేకం, గణపతి పూజ, సంపూర్ణహోమకార్యక్రమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. విగ్రహ దాతలు, కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.

బొడ్రాయి...


ప్రతిష్ఠించిన బొడ్రాయి

కూడేరు, ఏప్రిల్ 4: మండలంలోని ఇప్పేరు గ్రామంలో వేద పండితుల మంత్రాల నడుమ బొడ్రాయి ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గురువారం పలు రకాల పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇన్‌చార్జి పీఓను సస్పెండ్ చేయాలి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 4: పట్టణంలోని కేజీబీవీలో ఇన్‌చార్జి పీఓ వరప్రసాద్ నిర్లక్ష్యంత విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందడం లేదని వెంటనే అతన్ని సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కేజీబీవీలో గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కేజీబీవీలో పేదింటి విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. 8 నెలల నుంచి నాణ్యమైన భోజనం పెట్టడంలేదన్నారు. పీఓ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యార్థినులు అర్ధాకలితో చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పీఓ వ్యవహరిస్తున్న తీరుపై కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, వెంకట్‌నాయక్, నాయకులు శివమణి, అఖిల్‌కుమార్, రోహిత్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.